తాండూర్ : ఐబీలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు


బెజ్జూర్ : మండల కేంద్రంలో ఆదివాసీ నాయకులు


కాగజ్‌నగర్ : అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

చెన్నూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద..

శ్రీరాంపూర్ : జీఎం ఆఫీస్‌లో విగ్రహానికి పూల మాల వేస్తున్న జీఎం సూర్యనారాయణ, అధికారులు

హాజీపూర్ : నివాళులర్పిస్తున్న టీఎన్జీవో నాయకులు

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 6 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బీంరావ్ రాంజీ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్, నేతకాని, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణాలు, గ్రామాల్లోని కూడళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కోసిని పంచాయతీ పరిధిలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నివాసం ఆవరణలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావ్, నాయకులు నక్క మనోహర్, మహిళా నాయకులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయదేవ్, కార్యదర్శి శివప్రసాద్.., జైనూర్ మండలంలోని అంబేద్కర్ చౌక్ వద్ద విగ్రహానికి మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్ రావు, పీఈసీఎస్ చైర్మన్ మన్నుపటేల్.., సిర్పూర్(యూ)మండల కేంద్రంలో జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావ్.., శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఆఫీస్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎం ఎల్వీ సూర్యనారాయణ, డీవైజీఎం అరవిందరావు.., జన్నారం మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్.., సీసీసీ కార్నర్ వద్ద మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ సుర్మిల్ల వేణు, టీం ఫౌండర్ కూన రవికుమార్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎల్ శ్రీనివాస్, దాసరి వెంకటరమణ.., సీసీసీ టౌన్ షిప్‌లో అంబేద్కర్ సంఘం జిల్లా కార్యదర్శి కోండ్ర లింగయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శులు గద్దల బానయ్య, చుంచు శంకర్‌వర్మ, ఎంహెచ్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్, స్థానిక కౌన్సిలర్ కెడిక ప్రకాశ్‌రెడ్డి.., మందమర్రి పట్టణంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, చెన్నూర్ మాదిగ దళిత యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సతీశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్ఐ రాజశేఖర్.., అలాగే ఆదిల్ పేట్‌లో మాజీ జడ్పీటీసీ వేల్పుల రవి.., మంచిర్యాల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఐఆర్‌సీఎస్ జిల్లా జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్, జిల్లా కమిటీ సభ్యులు చుంచు శంకరయ్య.., మంచిర్యాల జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి.., బెల్లంపల్లి పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్.. అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

జైనూర్‌లో..

జైపూర్‌లో..

ఆసిఫాబాద్ టౌన్ : ప్రజా సంఘాల నాయకులు..

మందమర్రిలో..

జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట..


సీసీసీ నస్పూర్ : సీసీసీ కార్నర్ వద్ద..

కాసిపేటలో..

బాల్ వివాహ్ ముక్త్ భారత్ లక్ష్యాన్ని సాధించాలి

మాట్లాడుతున్న డీసీపీవో బూర్ల మహేశ్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 6 : బాల్ వివాహ్ ముక్త్ భారత్ లక్ష్యాన్ని సాధించాలని డీసీపీవో బూర్ల మహేశ్ పేర్కొన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో జిల్లాల్లో బాల్య వివాహాలు జరుగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు, ఆశ, అంగన్‌వాడీ, గ్రామ పెద్దలు, పూజరులను భాగస్వాములను చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో బాల్ రక్షక్ సిబ్బంది శ్రావణ్ కుమార్, శ్రీనివాస్, చంద్రశేఖర్, జామున, డోంగ్రె ప్రవీణ్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ అష్టలుద్దీన్

బెల్లంపల్లి, డిసెంబర్ 6 : మండలంలోని పాత బెల్లంపల్లి పంచాయతీ పరిధి మన్నెగూడెం గ్రామానికి చెందిన యండెల కమల (52)ను హత్య చేసిన కమ్మరి మహేందర్‌ను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ అష్టలుద్దీన్ తెలిపారు. సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గ్రామంలోని కమ్మరి మహేందర్, భార్య మౌనిక గురువారం ఇంట్లో గొడవపడ్డాడరు. మౌనికను మహేందర్ కొట్టడంతో పెద్దగా అరుస్తూ బయటకు పరుగులు పెట్టింది. తల్లి బురుస పద్మ, చెల్లె బుచ్చమ్మ, చిన్నమ్మ యండెల కమల వచ్చి మహేశ్‌తో వాగ్వాదానికి దిగారు. పద్మ, బుచ్చమ్మను మహేందర్ చితకబాదాడు. పద్మ తలకు గాయమైంది. గొడవ శాంతించడంతో ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు. ఈ క్రమంలో కమల గ్రామ కూడలి వద్ద నీటికోసం బోరువద్దకు వచ్చింది. అక్కడే ఉన్న మహేందర్ కమలపై దాడి చేశాడు. నీటితో నిండి ఉన్న బిందెను ఆమెపై పడేశాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. కమలను వందపడకల దవాఖానకు తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మహేందర్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు. తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ పాల్గొన్నారు.

రైతులు నిబంధనలు పాటించాలి

భీమారం, డిసెంబర్ 6 : రైతులు నిబంధనలు పాటించాలని, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ సుభావత్ మోతీలాల్ సూచించారు. భీమారం మండలం పోలంపల్లి ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో 315 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం గొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 6 : మండలంలోని కిష్టంపేట, ఆస్నాద్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. కేంద్రాల వద్ద తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పీఏసీఎస్ కార్యదర్శి రత్న లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులున్నారు.

వన్య ప్రాణులను కాపాడుకోవాలి

మద్దికల్‌లో అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

భీమారం, డిసెంబర్ 6 : వన్య ప్రాణులను కాపాడుకోవాలని, వేటడం నేరమని భీమారం డీవైఆర్వో సతీశ్ పేర్కొన్నారు. అంకుశపూర్, మద్దికల్ గ్రామాల్లో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వన్యప్రాణాల సంరక్షణతో పాటు, అటవీ ప్రాంతంలో నిప్పు పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఓఫ్‌బీవోలు అంజిత్, శివ కుమార్, బానేష్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం, డిసెంబర్ 6 : అటవీ సంపద సంరక్షణ అందరి బాధ్యత అని ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని దొంగపెల్లి, సింగరాయి పేట గ్రామాల గిరిజనులకు అటవీ క్షేత్రాధికారి పీ రాము అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్య, పెద్ద రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(యూ), డిసెంబర్ 6 : మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న సీఆర్టీ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ సైన్స్, ఇంగ్లిష్‌లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అందుకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు సోమవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరిట్ ఆధారంగా నియామకం ఉంటుందని తెలిపారు.

జైనూర్, డిసెంబర్ 6 : మండలంలోని కేజీబీవీలో ఇంగ్లిష్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థులను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేకాధికారి సుమలత ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులు, పీజీతో పాటు బీఈడీ చేసిన మహిళా అభ్యార్థులు అర్హులని, 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను కేజీబీవీ పొచ్చంలొద్దిలో సమర్పించాలని తెలిపారు.

బ్యాంకుల సేవలకు అంతరాయం

మాట్లాడుతున్న టీజీబీ రీజినల్ మేనేజర్ మురళీ మనోహర్ రావు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 6 : రాష్ట్రంలోని అన్ని జిల్లాల గ్రామీణ బ్యాంకుల శాఖలన్నీ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలోనికి వస్తుండడంతో ఈ నెల 28 నుంచి 31 వరకు కొన్ని సేవలు ఖాతాదారులకు అందుబాటులో ఉండవని, 27వ తేదీలోగా తమ బ్యాంకు వ్యవహారాలను పూర్తిచేసుకొని సహకరించాలని టీజీబీ మంచిర్యాల రీజినల్ మేనేజర్ మురళీ మనోహర్‌రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో గల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శాఖలన్నింటినీ విలీనం చేసుకొని జనవరి నుంచి ఒకే గ్రామీణ బ్యాంకుగా సేవలందించనున్నట్లు వివరించారు. ఈ కారణంగా 28 నుంచి 31వ తేదీ వరకు టీజీబీల్లో ఇంటర్‌నెట్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలు, సీఏస్పీ సెంటర్ల ద్వారా జరిగే సేవలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. జనవరి 1 నుంచి సేవలు పునరుద్ధరించనున్నట్లు వెల్లడించారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

మట్టి సేకరిస్తున్న ఏడీఏ ప్రసాద్, అధికారులు

హాజీపూర్, డిసెంబర్ 6 : భూసార పరీక్షలతోనే రైతులకు మేలు కలుగుతుందని ఏడీఏ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని ముల్కల్ల పంచాయతీలో శుక్రవారం పలువురు రైతుల పంట పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించారు. భూసార పరీక్షలు పథకం-2024లో పైలట్ ప్రాజెక్టును హాజీపూర్ మండలంలో 4,106 మట్టి నమూనాలను సేకరించి, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సేకరించిన భూసార నమూనాలను ఆదిలాబాద్ జిల్లాలోని పరీక్షా కేంద్రానికి పంపించి, ఫలితాలను రైతులకు ఇవ్వాలన్నారు. హాజీపూర్ మండల వ్యవసాయ అధికారి కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు కొమురయ్య, మౌనిక, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

లక్షెట్టిపేట, డిసెంబర్ 6 : లక్షెట్టిపేట ఎస్ఐ సతీశ్ ఆదేశాల మేరకు పట్టణంలో ఎస్ఐ-2 పనాస రాజయ్య తన సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనల తనిఖీ చేపట్టారు. పట్టణంలో నిభందనలు పాటించకుండా తిరుగుతున్న పలు వాహనదారులను అదుపులోకి తీసుకున్నారు. కౌన్సెలింగ్ ఇచ్చారు. యువకులు ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడుతున్నారని, తల్లితండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తున్నారన్న సమాచారంతో స్పెషల్ డ్రైవన్ నిర్వహించినట్లు తెలిపారు. బ్లూకోర్టు పోలీసులు బగ్గని సత్యనారాయణ, లక్ష్మణ్ ఉన్నారు.

పేరెంట్స్ మీటింగ్

మందమర్రి రూరల్, డిసెంబర్ 6 : మందమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల చదువు విషయంలో వారి క్రమశిక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు వివరించారు. కళాశాల అధ్యాపకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

కాసిపేట, డిసెంబర్ 6 : కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి బైపాస్ రోడ్డు మహరాజుల కాలనీ స్పీడ్ బ్రేకర్ల వద్ద పల్సర్ బైక్ నుంచి కింద పడి దేవాపూర్‌కు చెందిన కుసుమ్ దేవి(33) మృతి చెందినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. దేవాపూర్‌కు చెందిన సురేంద్ర సింగ్-కుసుమ్ దేవి దంపతులు వారి కూతురు నాలుగేళ్ల అనన్యతో పల్సర్ బైక్‌పై మంచిర్యాలకు వెళ్తున్నారు. మార్గ మధ్యలో ముత్యంపల్లి వద్ద సురేంద్ర సింగ్ అతివేగంగా అజాగ్రత్తగా బైక్ నడపడంతో కుసుమ్ దేవి కిందపడిపోయింది. తీవ్రగాయాలవగా, అంబులెన్స్‌లో కాసిపేట పీహెచ్‌సీకి తరలించగా, వైద్యులు పరీక్షించిన మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్రహ్మదేవ్ శర్మ వర్ధంతి

కాసిపేట, డిసెంబర్ 6 : కాసిపేట మండలం దేవాపూర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో అమరుడు, మాజీ ఐఏఎస్ అధికారి బ్రహ్మదేవ్ (బీడీ) శర్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయక్ పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తట్రా భీంరావ్, ఆదివాసీ కొలాం సేవా సంఘం జిల్లా కన్వీనర్ ఆత్రం మహేశ్, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు సంద్ర భూమయ్య, నాయక్‌పోడ్ సేవా సంఘం కాసిపేట సాంస్కృతిక కార్యదర్శి రెడ్డి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు సిడాం శంకర్, నాయకులు బోగె పోచన్న, కోవ లింగు, టేకం భగవంతరావ్ పాల్గొన్నారు.

బీసీ నేతల సైకిల్ యాత్ర

మంచిర్యాలలో చేపట్టిన సైకిల్ యాత్రలో బీసీ హక్కుల పోరాట సమితి నేతలు

మంచిర్యాల (ఏసీసీ), డిసెంబర్ 6 : పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నేతలు శుక్రవారం సైకిల్ యాత్ర చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి లక్షెట్టిపేటలోని ఉత్కూర్ చౌరస్తా వరకు యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో గుమ్ముల శ్రీనివాస్, శాఖపురి భీంసేన్, నైనెల్ల నరసయ్య, శాఖపురం కోటేశ్వరరావు, వడ్డెపల్లి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో హార్వెస్టర్ డ్రైవర్‌కు గాయాలు

నెన్నెల, డిసెంబర్ 6 : నెన్నెల సమీపంలోని బొప్పారం వద్ద వరి కోస్తుండగా, హార్వెస్టర్‌కు 11కేవీ విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో డ్రైవర్ పాల్తె సంతోష్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన రైతులు వెంటనే 108 అంబులెన్సులో దవాఖాకు తరలించారు.

అక్రమ ప్రహరీ నిర్మాణం కూల్చివేత

బెల్లంపల్లి, డిసెంబర్ 6 : ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ఏర్పాటు చేసిన ప్రహరీని శుక్రవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. మండలంలోని ఇందిరానగర్ ఏరియాలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఫిర్యాదుల మేరకు ఆర్ఐ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ సాయంతో గోడను నేలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు.

మందుబాబులకు శిక్ష

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 6 : ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో పట్టుబడిన 8 మందికి వారం జైలు, మరో 10 మందికి ట్రాఫిక్ విధులు నిర్వహించాలని శిక్ష విధిస్తూ సెకండ్ అడిషనల్ జూనియర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నిరోష శుక్రవారం తీర్పునిచ్చినట్లు మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మందుబాబులను కోర్టులో హాజరుపర్చగా శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలంతా విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్, డిసెంబర్ 6 : కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం బైక్‌పై తరలిస్తున్న దేశీదారును పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఇమ్రాన్ నజీర్ బేగ్ తన బైక్‌పై 198 (90 ఎంఎల్) దేశీదారు సీసాలను తరలిస్తుండగా, పట్టుకొని నిందితుడిని అదుపులో తీసకున్నట్లు స్పష్టం చేశారు.

వృద్ధుడి ఆత్మహత్య

నెన్నెల, డిసెంబర్ 6 : మండలంలోని దమ్మిరెడ్డిపేట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి పసుల పోశం (74) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. గురువారం మద్యం మత్తులో ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బెల్లంపల్లిలోని దవాఖానకు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. పోశంకు భార్య, ఇద్దరు కొడుకులున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మామిడి కొనుగోలు కేంద్రం ప్రారంభానికి చర్యలు

బెల్లంపల్లి, డిసెంబర్ 6 : బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మామిడి కొనుగోలు కేంద్రం ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్ తెలిపారు. మార్కెట్ యార్డు కమిటీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పండిన మిమిడికాయలను రైతులు నాగ్‌పూర్, ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ వేసవిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్ భాస్కర్, జిల్లా ఉద్యానవన అధికారి కే అనిత, ఇతర ఉద్యానవన అధికారులు, కొనుగోలుదారులు, రైతులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

నస్పూర్, డిసెంబర్ 6 : దివ్యాంగ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం మంచిర్యాల జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా బాబు, సెక్రటరీగా కందుల తిరుపతి నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు సిద్ధం చేసిన విద్యార్థులు

నస్పూర్, డిసెంబర్ 6 : నేషనల్ స్పేస్ సొసైటీ అమెరికా సంస్థ నాసా అనుబంధంతో యేటా అంతరిక్షంపై సైన్స్ ప్రాజెక్టులను ఆహ్వానిస్తుండగా, ఈ సారి మంచిర్యాల శ్రీ చైతన్య పాఠశాల లక్ష్మీనగర్ బ్రాంచ్ 25 మంది విద్యార్థులు 3 ప్రాజెక్టులను శుక్రవారం సిద్ధం చేశారు. భూమిపై ఉనికిలేనప్పుడు అంతరిక్షంలో ఎలా బతకాలనే అంశంపై రూపొందించారు. నిర్వాహకులు పంపిన కిట్లను జిల్లా సైన్స్ అధికారి మధుబాబు విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ విద్య అభినందించారు.

రేషన్ షాపుల్లో తనిఖీ

కాగజ్‌నగర్, డిసెంబర్ 6 : కాగజ్‌నగర్ పట్టణంలోని పలు రేషన్ షాపులను శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్, ఆర్ఐ సిద్ధార్థ తనిఖీ చేశారు. బాలాజీనగర్‌లోని షాప్ నంబర్ 40లో 5 క్వింటాళ్ల బియ్యం ఆన్‌లైన్ రికార్డు కంటే తక్కువగా ఉన్నాయని గుర్తించడంతో పాటు, డీలర్ శ్రీరాములు కాకుండా షాపును బినామీ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. డీలర్ పిల్లల తిరుపతికి చెందిన షాప్ నంబర్ 49లో సైతం బినామీ నిర్వహిస్తున్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. షాపు నంబర్ 40 నిర్వాహకుడిపై 6ఏ కేసు నమోదు చేసి, రెండు షాపులను బినామీలు నిర్వహిస్తున్నట్లు ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు పేర్కొన్నారు.

కౌటాలలో మోస్తరు వర్షం

కౌటాల, డిసెంబర్ 6 : మండల వ్యాప్తంగా శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్ష కురిసింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చి, పది నిమిషాల పాటు వానపడింది. దీంతో అక్కడక్కడా పత్తి, వరి పంటలు తడిసిపోయాయి.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

కాసిపేట, డిసెంబర్ 6 : విద్యా శాఖలో విధులు నిర్వహించే సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు శుక్రవారం నుంచి విధులకు హాజరుకాకుండా సమ్మెకు దిగారు. రెగ్యులరైజేషన్ చేయాలని, అప్పటివరకు తక్షణమే టైం స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెతో విద్యాశాఖలో పూర్తిగా పనులు నిలిచిపోయాయి.

మహాసభలను విజయవంతం చేయండి

తాండూర్, డిసెంబర్ 6 : బెల్లంపల్లి పట్టణంలోని తాపీ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ మంచిర్యాల జిల్లా ఐదో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి బీ దేవదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతిథులుగా రాష్ట్ర కార్యదర్శులు ఏ వెంకట్, వీ శాంతికుమారి హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఉపాధ్యాయులు, విద్యా అభిమానులు సకాలంలో తరలిరావాలని కోరారు.

'అభివృద్ధిపై చర్చకు సిద్ధం'

కాగజ్‌నగర్, డిసెంబర్ 6 : సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు కాంగ్రెస్ నాయకులకు సవాల్ చేశారు. పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని ఆయన నివాసంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు అవాకులు చివాకులు పేలడం మాని, ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టిపెడితే బాగుంటుందని హితవు పలికారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, తేదీ, సమయం నిర్ణయిస్తే ఎక్కడికైనా వచ్చేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, నాయకులు శ్రీశైలం, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.